


## 'ఖేడ్'లో రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

నారాయణఖేడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లోని సత్యసాయి మందిరంలో రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి బాధ్యులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారికి శిబిరంలో ఉచితంగా చికిత్సలు చేసి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఆపరేషన్ అవసరమైనవారికి ఆస్పత్రులకు తరలించి ఉచితంగా చేయిస్తామని తెలియజేశారు. పూర్తి వివరాల కోసం 9676171527 నంబర్‌లో సంప్రదించాల పేర్కొన్నారు.



## చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17




7

### వీరులారా..
# వందనం

రజాకార్లతో పోరాటంలో ప్రాణాలర్పించిన యోధులు





ముస్తాబైన మెదక్ కలెక్టరేట్

## ప్రజాపాలన దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

**జాతీయ పతాకాన్ని ఎగురువేయనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్**

మెదక్ అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవానికి మెదక్ ముస్తాబైంది. పండుగ వాతావరణంలో వేడుకలను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం పరిశీలించారు. నేడు ఉదయం 10 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సందేశం ఇస్తారని తెలిపారు. పోలీసు, రెవెన్యూశాఖలు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రస్తుతానికి, మరో 50 ఏళ్లకు సరిపడా మంజీరా వాటర్ స్కీమ్ డిజైన్ చేయండి

**సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో నీటిసరఫరాపై నిర్మల, జగ్గారెడ్డి సమీక్ష**

**హాజరైన మున్సిపల్, పబ్లిక్ హెల్త్, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు**

**తక్షణ నీటి సరఫరా కోసం రూ.15కోట్లతో తాళ్లపల్లి ఫిల్టర్‌బెడ్ ఆధునీకరణ, నాలుగు మండలాల్లో ట్యాంకులు, పైపులైన్ల మరమ్మతులకు ప్రతిపాదనలు**

**వచ్చేనెలలోనే సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన : నిర్మల, జగ్గారెడ్డి**



సమీక్షలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీ ప్రజలకు స్వచ్ఛమైన నీళ్లందించేలా ప్రస్తుతానికి, మరో యాభై సంవత్సరాలకు సరిపడా మంజీరా వాటర్ స్కీమ్ డిజైన్ చేయాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. మంగళవారం వారు సంగారెడ్డిలో మున్సిపల్, పబ్లిక్‌హెల్త్, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి ఈ నెల 30వ తేదీ వరకు నివేదిక సిద్ధం చేస్తే నిర్మలతో కలిసి ఈఎన్సీకి రిపోర్టు అందజేస్తాని చెప్పారు. వచ్చే నెల 15వ తేదీ లోపు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉంటుందని, ఈ విషయంపై మంత్రి దామోదర్ రాజనర్సింహతో కూడా మాట్లాడినట్లు వివరించారు. రెండు మున్సిపాలిటీల్లో ప్రతీ రోజు ఏక కాలంలో రెండు గంటల పాటు మంజీరా నీరందేలా డిజైన్ చేయాలని తెలిపారు. తక్షణ అవసరంగా తాళ్లపల్లి ఫిల్టర్‌బెడ్ నుంచి ప్రత్యేక లైన్ వేస్తే 54 గ్రామాలకు మంజీర నీటిని సరఫరా చేయొచ్చని అధికారులు చెప్పగానే జగ్గారెడ్డి స్పందించి సీఎంతో మాట్లాడి రూ. 10కోట్లు, ఇతర మరమ్మతులకు మరో రూ. 5కోట్లు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు.



హాజరైన అధికారులు, నియోజకవర్గ నాయకులు

## మహిళా ప్రాంగణంలో డీసీహెచ్‌ఎస్ ఆఫీస్

- పటాన్‌చెరుకు తరలింపు నిర్ణయం వెనక్కి
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన యంత్రాంగం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీవీవీపీ పరిధిలోని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) కార్యాలయాన్ని సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని మహిళా ప్రాంగణానికి తరలించాలని అధికారులు నిర్ణయానికి వచ్చారు. ఈ కార్యాలయాన్ని పటాన్‌చెరుకు తరలించాలని యోచించినా, ఉన్నతాధికారులతో పాటు మంత్రి దామోదర్ విముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. డీసీహెచ్‌ఎస్ కార్యాలయం జిల్లా కేంద్రంలో ఉంచితే అందరికి అనుకూలంగా ఉంటుందని టీవీవీపీ అధికారులకు సూచించినట్టు సమాచారం. ఈ విషయాన్ని ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో యంత్రాంగం స్పందించింది. డీసీహెచ్‌ఎస్ ఆఫీస్‌ను పటాన్‌చెరుకు తరలింపుపై అధికారులు వెనక్కి తగ్గారు. అంతే కాకుండా డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని కూడా మహిళా ప్రాంగణంలోనికే లేదా మరో చోటుకు తరలించేందుకు అధికారులు యోచిస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ, అనుబంధ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏ ఇతర కార్యాలయాలు ఉండేందుకు వీలు లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీసీహెచ్‌ఎస్‌తో పాటు డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని త్వరలో తరలించే అవకాశాలు ఉన్నాయని ఆయా శాఖల అధికార వర్గాలు తెలిపాయి.

# ముంచెత్తిన వాన

**సోమవారం రాత్రి నుంచి వదలని వర్షం**

**రేగోడ్‌లో అత్యధికంగా 18 సెం.మీ. వర్షపాతం**

**మెదక్‌లో రోడ్లు జలమయం, షాపుల్లో నిలిచిన నీరు**



మెదక్‌లో రోడ్డుపై వరద

మెదక్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా మరోసారి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పది రోజుల క్రితం సృష్టించిన బీభత్సాన్ని మరువకముందే సోమవారం రాత్రి నుంచి మరోసారి వర్షాలు కురుస్తున్నాయి. గడచిన 24 గంటల వ్యవధిలో అత్యధికంగా రేగోడ్‌లో 20 సెం.మీ., కొల్చారంలో 15 సెం.మీ., పాపన్నపేటలో 14 సెం.మీ., టేక్మాల్‌లో 11 సెం.మీ., మెదక్‌లో 10 సెం.మీ., హవేళిఘణపూర్‌లో 10టేక్మాల్‌లో 11 సెం.మీ., మిగతా మండలాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మెదక్ పట్టణంలో ప్రధాన రహదారులపై వరద ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ కాంప్లెక్స్‌లోని షాపుల్లో నీరు నిలిచింది. సింగూరు ప్రాజెక్టు నుంచి మంజీరా నీరు వదలడంతో ఏడుపాయల ఆలయం మూసివేశారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలో వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి.

● అల్లాదుర్గం: మండల కేంద్రంలోని బట్టికుంటకు పడిన గండికి మరమ్మతులు చేయకపోవడంతో వరద నీరు వచ్చింది వచ్చినట్లు కిందికి ప్రవహించి రోడ్డును ముంచెత్తడంతో వాహనరాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బాలుర వసతిగృహం విద్యార్థులు ఇదే దారిగుండా స్కూలుకు వెళ్లాల్సి ఉండటంతో ఇబ్బందిపడ్డారు.

● రేగోడు: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై వాగులు, చెరువు అలుగు నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్యారారం గ్రామానికి వెళ్లే రోడ్డుపై వాగు నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్కూలు విద్యార్థులు నీళ్లలో చిక్కుబడిపోవడంతో గ్రామస్థులు ట్రాక్టర్‌లో విద్యార్థులను వాగు దాటించారు. మండల పరిధిలోని టీ-లింగంపల్లి, జగిర్యాల, పెద్దతండాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. తిమ్మాపురం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

● టేక్మాల్: సోమవారం రాత్రి కురిసిన వర్షానికి గుండువాగు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. హవేళిఘణపూర్ మండల పరిధిలో చౌట్లపల్లి మార్గం మూసుకుపోయింది.

● హవేళిఘణపూర్: మండలంలోని చౌట్లపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగు పొంగిపొర్లడంతో మంగళవారం మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి.

### సంగారెడ్డి జిల్లాలో..

నారాయణఖేడ్: డివిజన్‌లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.

● కంది: వర్షానికి మండలంలోని మామిడిపల్లి-కవలంపేట గ్రామాల మధ్య రహదారిపై వరద నీరు చేరడంతో రాకపోకలకు ఆటంకం కలిగింది.

### రూ. కోటి రోడ్డు కొట్టుకుపోయింది

రేగోడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్-మంచిర్యాల తండాకు నిర్మించిన రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. ఇటీవల ఈ రోడ్డును కోటి రూపాయలు వెచ్చించి నిర్మించారు. రోడ్డు వేసినా కల్వర్టులు కట్టకపోవడంతో వరద నీరు పత్తి చేలు, వరి పొలాలను ముంచెత్తింది.



రేగోడు మండలంలో కొట్టుకుపోయిన కొండాపూర్-మంచిర్యాల తండా రోడ్డు



కుంటకు గండి పడి అల్లాదుర్గం రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



టేక్మాల్-జోగిపేట రహదారిపై పొంగిపొర్లుతున్న గుండువాగు





రేగోడు మండలంలో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌పై జనం తరలింపు

## ట్రిపుల్ ఆర్ పరిహారం వచ్చేస్తోంది..

**నర్సాపూర్, తూప్రాన్ డివిజన్లలో పలు గ్రామాల రైతులకు అవార్డు నోటీసులు**



నర్సాపూర్/తూప్రాన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పరిహారం ఎట్టకేలకు అందనున్నది. ఇందుకోసం నర్సాపూర్ డివిజన్ పరిధిలో గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులకు నోటీసులు ఇచ్చే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. నర్సాపూర్ డివిజన్‌లో పాంబండ, తిర్మలాపూర్, చిన్నచింతకుంట, గుండ్లపల్లి, నాగులపల్లి గ్రామాల్లో రైతులకు నోటీసులు జారీచేసి వారి నుంచి వివరాలను సేకరిస్తున్నారు. మిగతా గ్రామాల్లోనూ ఆర్థిక శాఖ నుంచి అనుమతి రాగానే నోటీసులు జారీ చేసి పరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ పేర్కొన్నారు. తూప్రాన్ డివిజన్‌లో తూప్రాన్ మండలంలోని వెంకటాయపల్లి, గుండ్రెడ్డిపల్లి, కిష్టాపూర్, దాతర్‌పల్లి, వట్టూరు గ్రామాల్లో రైతులకు అవార్డు నోటీసులు అందజేస్తున్నారు. ప్రస్తుతానికి పాత ప్రభుత్వ నిర్ణయం ప్రకారం నోటీసులు జారీ చేస్తున్నారు.

### పరిహారం పెరిగేనా?

ట్రిపుల్ ఆర్ కోసం తీసుకున్న భూములకు ప్రభుత్వం ప్రతిపాదించిన పరిహారంపై రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నర్సాపూర్ డివిజన్ పరిధిలోని నర్సాపూర్ మండలంలో 9, శివ్వంపేట మండలంలో 8 గ్రామాల మీదుగా ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మించనున్నారు. ఇందుకోసం 1,048 మంది రైతుల నుంచి 758 ఎకరాల భూమిని సేకరించేందుకు రైతుల అంగీకారం తీసుకున్నారు. తూప్రాన్ డివిజన్ పరిధిలో తూప్రాన్ మండలంలో 8 గ్రామాల్లో 436.20 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఇస్తామన్న పరిహారానికి, బహిరంగ మార్కెట్‌లో భూమి విలువకు పొంతన లేకపోవడంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రభుత్వ ధర ఎకరాకు రూ. రూ.4.50 లక్షల నుంచి రూ.6.75 లక్షల వరకు మాత్రమే ఉన్నది. దీనికి మూడింతలు పరిహారం ఇచ్చే అవకాశం ఉండటంతో రైతులు ఒప్పుకోలేదు. బహిరంగ మార్కెట్‌లో భూమి రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని పలుమార్లు రైతులు ఆందోళనలు చేశారు. దీంతో, కలెక్టర్ ప్రత్యేక కమిటీని వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం నిర్ణయించిన భూమి ధరను రూ.15 లక్షల వరకు పెంచాలని ప్రతిపాదించారు. దీని ప్రకారం రైతులకు రూ. 40 లక్షలకు పైగా పరిహారం ఇచ్చేందుకు వీలుంటుంది. తొలి విడతలో ఎకరాకు రూ. 13 లక్షల వరకు పరిహారం వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. రెండో విడత కలెక్టర్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని తెలుస్తున్నది.



## రుణాల రెన్యూవల్ కోసం పడిగాపులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రుణాలు పొందినవారు సకాలంలో తిరిగి చెల్లిద్దామని వస్తే పడిగాపులు పడాల్సి వస్తున్నది. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోజుల తరబడి ప్రదక్షిణ చేయాల్సి వస్తున్నది. నారాయణఖేడ్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రధాన శాఖ ద్వారా దత్తత గ్రామాల్లో వేలాదిమంది రైతులకు పంట రుణాలు ఇచ్చారు. సకాలంలో రెన్యూవల్ చేసుకుంటే వడ్డీ రాయితీ వస్తుండటంతో నాలుగైదు రోజులుగా రైతులు బ్యాంకు వద్దకు వస్తున్నారు. రోజూ 50 మందికి మాత్రమే రెన్యూవల్ చేస్తుండటంతో మిగిలినవారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. దీంతో, రోజూ ఉదయం 7 గంటలకే రైతులు బ్యాంకు వద్దకు చేరుకుని పట్టాదారు పాస్‌పుస్తకాలను లైన్‌లో పెట్టి నిరీక్షిస్తున్నారు. ఇలా అయితే మొత్తం రైతు రుణాల రెన్యూవల్ ప్రక్రియ పూర్తిచేయడానికి నెలలు పట్టొచ్చని వాపోతున్నారు.

## 248 మంది టీచర్ల సర్దుబాటు

**మెదక్ జిల్లాలో మరోసారి..**

మెదక్ అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో మరోసారి టీచర్ల సర్దుబాటు చేశారు. ఇటీవల చేపట్టిన పదోన్నతులతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడానికి ఈ ప్రక్రియ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో అవసరానికి మించి పనిచేస్తున్న టీచర్లను గుర్తించిన విద్యాశాఖ ఖాళీలు ఉన్నచోట్ల ఉపాధ్యాయును కేటాయించింది. మొదటి విడత సర్దుబాటు ప్రక్రియలో వివిధ పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించి విషయం తెలిసిందే. కానీ ఇటీవల పదోన్నతులతో పలు చోట్ల స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులు ఖాళీ అయ్యాయి. దీంతో, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఈ నెల 4న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొలి విడత సర్దుబాటు ప్రక్రియ గందరగోళంగా మారిన నేపథ్యంలో ఈసారి ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యాశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈమేరకు డీఈవో రాధాకిషన్ ప్రత్యేక కమిటీని, పర్యవేక్షణ అధికారులను నియమించారు. జిల్లాలో 246 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని నిర్ణయించి జాబితాను కలెక్టర్‌కు అందజేశారు. ఆయన ఆమోదంతో వారు మంగళవారం విధుల్లో చేరారు.



### జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా 902 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. మొత్తం 4,044 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా 3,529 పోస్టులను కేటాయించారు. ఇందులోనూ ఇటీవల 515 ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిని సర్దుబాటు ద్వారా తాత్కాలికంగా భరీ చేసేందుకు విద్యాశాఖ జూలైలో మొదటి విడత ప్రక్రియను చేపట్టింది. ఇటీవల పదోన్నతి పొందిన వారిలో జిల్లాలో 72 మంది ఎస్జీటీలకు పీజీహెచ్‌ఎంలుగా, 23 మంది స్కూల్ అసిస్టెంట్‌లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. దాంతో పాఠశాలల్లో మళ్లీ ఖాళీలు ఏర్పడ్డాయి. తాజాగా 248 మంది ఉపాధ్యాయలను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద అవసరం ఉన్న పాఠశాలలకు కేటాయించినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టినట్లు వెల్లడించారు.




## రేషన్ బియ్యం పట్టివేత

● పోలీస్ స్టేషన్‌కు తరలింపు



బియ్యం తరలిస్తున్న లారీ

పుల్‌కల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా వద్ద పుల్కల్ ఎస్ఐ ఎన్.విశ్వజన్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో (ఎంహెచ్ 22ఏఏ 3921) నంబరు గల లారీలో రేషన్ (దొడ్డు) బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యానికి సంబంధించిన పత్రాలు చూపించాలంటూ డ్రైవర్‌కు సూచించగా, తన వద్ద ఎలాంటి పత్రాలు లేవనడంతో లారీని పుల్కల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ విశ్వజన్ పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు. పంచనామా చేసి నిర్ధారణ చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ నయాబ్ తహసీల్దార్ సాజిద్దీన్ తెలిపారు.

# ఈ కష్టం.. ఇంకెన్నాళ్లు

● మూడువారాలైనా కల్వర్టును బాగు చేయరా?
● అవస్థలు పడుతూ స్కూల్‌కు వెళ్తున్న పిల్లలు
● రోగం వస్తే వీపుపై మోసుకెళ్తున్న దైన్యం



కష్టంగా కల్వర్టు దాటుతున్న ప్రజలు

రామాయంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ కష్టం ఇంకెన్నాళ్లు..! మూడువారాలైనా ముందడుగు ఏదీ..? అంటూ ఐదు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామాయంపేట మండల పరిధి పర్వతాపూర్ వెళ్లే కల్వర్టు వరదలకు కొట్టుకుపోయింది. దీంతో 20 రోజులుగా రోడ్లు తెగి పక్క గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అటు కళాశాలలు, హైస్కూల్ వెళ్లే విద్యార్థులు పడుతూ.. లేస్తూ వెళ్లాల్సి వస్తోంది. ఈ కల్వర్టు అవతల కిషన్, లక్యాతండాలతో పాటు పర్వతాపూర్ గ్రామాలు ఉన్నాయి. ఇన్నిరోజులుగా ఈ ప్రాంత ప్రజానీకం బిక్కుబిక్కుమంటూ కాలం వెలదీస్తోంది. ఎవరికైనా వైద్య అవసరాలు వస్తే.. వీపుపై రోగులను మోసుకెళ్లాల్సిన దుస్థితి పట్టింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

### నడుచుకుంటూ వెళ్తున్నాం

20 రోజులుగా నడుచుకుంటూ డిగ్రీ కాలేజీకి వెళ్తున్నాం. నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. లక్యాతండా నుంచి లక్ష్మాపూర్ గేటు వద్దకు వెళ్లి బస్సులో రామాయంపేటకు వస్తున్నాం.

-కృపావతి, విద్యార్థి

### రోడ్డు తెగిపోవడం వల్లే కష్టం

కల్వర్టు వరదలకు కొట్టుకుపోవడంతో మూడువారాలుగా నడుచుకుంటూ లక్యాతండా పాఠశాలకు వెళ్తున్న. రోడ్డు తెగిపోవడం వల్ల ఇంత కష్టం వచ్చింది.

- విజయ్‌కుమార్, ప్రభుత్వ టీచర్







# నిఘా కట్టుదిట్టం చేయాలి

● నేరాల అదుపుకు పటిష్ట చర్యలు
● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



హత్నూర పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

హత్నూర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం హత్నూర పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు, సిబ్బంది బ్యారక్‌లతో పాటు, పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. గ్రామ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామంపై పూర్తి అవగాహన ఉండాలని, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని ప్రతీ సమాచారం అందేలా చూడాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో పొందుపరిచే రికార్డులు పార్ట్ 1 నుంచి 5వరకు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తెలంగాణ పోలీసుశాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్, సీఈఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ ఓన్ కెమెరాల వంటి అన్నిరకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, జిన్నారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నయీం, ఎస్‌హెచ్‌వో శ్రీధర్ రెడ్డి, సీసీ విజయ్‌పవార్ పాల్గొన్నారు.

# గుండెపోటుతో వేర్వేరుగా ఇరువురు ఉద్యోగులు మృతి



షాబోద్దీన్



పండరి

నారాయణఖేడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో ఒకేరోజు నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ఇరువురు ప్రభుత్వ ఉద్యోగులు మంగళవారం మృతిచెందారు. నారాయణఖేడ్ ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న షాబోద్దీన్(45) మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉండగా గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. షాబోద్దీన్ మృతితో స్వగ్రామమైన ఝరాసంగం మండలం కుప్పనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. షాబోద్దీన్‌కు భార్య, కుమారుడు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. అలాగే కంగ్టి మండలం పంచమహల్ దామర్‌గిద్దకు చెందిన దరుకు పండరి(40) మియాపూర్-2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం విధి నిర్వహణలో ఉండగా మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య రుక్మిణి, కుమారులు ఉన్నారు.

### వారంలో ముగ్గురు ఉద్యోగులు..

నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ముగ్గురు ఉద్యోగులు వారంరోజుల వ్యవధిలోనే గుండెపోటుతో మృతిచెందారు. ఈనెల 13న నారాయణఖేడ్ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అటెండర్ మచ్కూరి మొగులయ్య, మంగళవారం షాబోద్దీన్, దరుకు పండరి మృతిచెందారు.







## అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



అనిల్(ఫైల్)

తూప్రాన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధి, కుటుంబ అవసరాలకు చేసిన అప్పులు తీర్చే మార్గంలేక ఓ యువకుడు ఉరేసుకొని మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి గ్రామానికి చెందిన బొల్లెబోయిన అనిల్(30) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జీవనోపాధికి, కుటుంబ అవసరాలకు అనిల్ అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి 9 గంటలకు భార్య లతకు పని ఉందని బయటకు వెళ్లితిరిగి రాలేదు. కుటుంబీకులు మంగళవారం ఉదయం వెతకగా సమీపంలోని సుప్ర కెమ్ కంపెనీ ఎదురుగా ఉన్న నారాయణరావు వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు అనిల్‌కు భార్య లత, ఓ కొడుకు ఉన్నాడు. మృతుడి తండ్రి పర్వతాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్ఐ-2 యాదగిరి వివరించారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హత్నూర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన హత్నూర మండలం చీక్‌మద్దూర్‌లో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన కుమ్మరి కృష్ణ(45) గ్రామ శివారులోని దుబ్బ చెరువులో పడిపోయాడు. కాగా గ్రామానికి చెందిన మచ్చుకూరి సత్యనారాయణ, నీరుడి ఏసు అతడిని కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడు కృష్ణకు ఇద్దరు భార్యలు లక్ష్మి, విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

## అందరూ చూస్తుండగా.. రైలు కిందికి వెళ్లి

● మతి స్థిమితం లేని వ్యక్తి మృతి



నర్సింహులు(ఫైల్)

జహీరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ మతిస్థిమితం లేని వ్యక్తి అందరూ చూస్తుండగా రైలు కిందికి వెళ్లి చనిపోయాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం జరిగింది. రైల్వే పోలీసులు, స్టేషన్ అధికారుల కథనం ప్రకారం.. షిర్డి నుంచి తిరుపతికి వెళ్తున్న ప్యాసింజర్ రైలు మంగళవారం జహీరాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తోంది. ఈ రైలు కదులుతున్న సమయంలో జిల్లాలోని ఝరాసంగం మండలం ప్యాలవరం గ్రామానికి చెందిన తెనుగు నర్సింలు(55) అందరూ చూస్తుండగా, రైలు కిందికి వెళ్లాడు. ఇతని మానసిక పరిస్థితి బాగాలేదని చెప్పారు. అలాగే, మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన అనిల్ కెడ్కే(38) రైలు ఎక్కుతూ జారిపడి గాయపడ్డాడు. వికారాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

వర్గల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. వర్గల్ మండలం నాచారంకు చెందిన కుమ్మరి శైలజ(21) సోమవారం రాత్రి 9.00 గంటలకు తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి పడుకున్నది. 10.30 గంటలకు తండ్రి కృష్ణ లేచి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

### తుర్కపల్లిలో..

నారాయణఖేడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తుర్కపల్లికి చెందిన వడ్డె హనుమయ్య(65) ఆగస్టు 15న ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. హనుమయ్యకు మతిస్థిమితం సరిగ్గా లేదని తెలిపారు. ఆచూకీ తెలిస్తే 8712656757 లేదా 8712661853 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి మంగళవారం తెలిపారు.









# వీరులారా.. వందనం

● రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం ● ప్రాణాలు అర్పించిన యోధులు

బైరాన్‌పల్లి.. రజాకార్ల రాక్షసత్వాన్ని బలైన గ్రామం. ఒకే రోజు 96 మందిని నిజాం సైన్యం, రజాకారులు కాల్చి చంపారు. వయసులో ఉన్న ఆడవాళ్లను చెరిచారు. శవాల చుట్టూ బతుకమ్మ ఆడించి తమపై చాకిత్యాన్ని ప్రదర్శించారు. మొత్తంగా బైరాన్‌పల్లిని మరో జలియన్‌వాలా బాగ్‌గా మార్చేశారు. బైరాన్‌పల్లి ఒక్కటే కాదు ఉమ్మడి జిల్లాలో నాడు ప్రతి పల్లె నిజాంకు వ్యతిరేకంగా, రజాకార్లకు ఎదురొడ్డి పోరాడింది. ఈ పోరాటంలో ఎందరో యోధులు తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలారు. నిజాం ఏలుబడిలోని తెలంగాణ ప్రాంతం భారతదేశంలో భాగస్వామ్యం అయిన సెప్టెంబర్ 17 సందర్భంగా వారి త్యాగాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే, వారి త్యాగాలు నేటి తరానికి తెలియ జేసేందుకు పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పోరాట గడ్డ కోరుతోంది. నాటి పోరాట యోధులను గుర్తించాలనీ కోరుతోంది.

## మరో జలియన్‌వాలాబాగ్.. బైరాన్‌పల్లి

● ఒకేరోజు 96 మంది కాల్చివేత

మద్దూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బైరాన్‌పల్లి.. రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రత్యేక స్థానం. రజాకార్ల రాక్షసత్వానికి బైరాన్‌పల్లి, కూటిగల్, ఆకునూర్, మాసిరెడ్డిపల్లె, రేణిగుంట, గుండ్రాల పల్లి, పెరుమాళ్ల సంకీసలో వందలాది మంది బలయ్యారు. ఈ ప్రాంతానికి చెందిన నారాయణరావు, గుండయ్య, జగదీశ్వర్, ఈశ్వరయ్య నిజాంను హతమార్చాలనే ధృడసంకల్పంతో హైదరాబాద్ వెళ్లారు. 1947 డిసెంబరు 4న సాయంత్రం 4.15 గంటలకు నిజాం సవారీ కింగ్ కోఠి రోడ్ నుంచి బయలుదేరగా, 4.25కు ఆల్ సెయింట్స్ సందు వద్ద నారాయణరావు బాంబు విసిరారు. ఈ బాంబు దాడి నుంచి నిజాం తప్పించుకున్నాడు. మరో పక్క రజాకారుల దౌర్జన్యాలు పెరిగిపోతున్న తరుణంలో కమ్యూనిస్టుల సహాయంతో యువకులతో కలిసి గ్రామ రక్షణ దళాలు ఏర్పాటు చేశారు. బైరాన్‌పల్లి గ్రామస్థుల చేతిలో రజాకార్ల నాయకుడు అవ్వల్‌సాబ్ కుమారుడు చనిపోగా, గ్రామాన్ని నాశనం చేయాలని రజాకారులు ఐదుసార్లు దాడిచేశారు. ఈ దాడుల్లో 9మంది రజాకారులు చనిపోయారు. ఇది రజాకారులకు పెద్ద సవాల్‌గా మారింది. గ్రామంపై నిజాం సైనిక బలగాలు దాడి చేయబోతున్నాయని కమ్యూనిస్టు నాయకులు పంపిన సమాచారం గ్రామానికి చేరలేదు. ఈ క్రమంలో 1948 ఆగస్టు ఆఖరివారంలో రజాకార్లు, పోలీసులు, మిలటరీ సాయంతో పెద్దఎత్తున గ్రామంపై దాడికి దిగారు. రాత్రి 12 గంటలకు జనగామ నుంచి 10 ట్రక్కులలో బయలుదేరి రాత్రి 3 గంటలకల్లా బైరాన్‌పల్లికి చేరుకుని గ్రామాన్ని చుట్టుముట్టారు. ఉదయం 4 గంటలకు బహిర్భూమికి వెళ్లిన వడ్ల నర్సయ్యను పట్టుకున్నారు. అతని సహాయంతో గ్రామంలోకి వస్తుండగా, ఆయన వారిని నెట్టివేసి గ్రామంలోకి రజాకారులు చొరబడ్డారని కేకలు వేయడంతో గ్రామస్థులు అప్రమత్తం అయ్యారు. దళ కమాండర్ రాంరెడ్డి వెంటనే ప్రజలు తగు రక్షణలో ఉండాలని నగారా మోగించారు. దీంతో బురుజు వద్ద గల గడీలోకి జనం పరుగులు పెట్టారు. యువకులు నాలుగు వైపులా చేతికందిన ఆయుధాలతో కాపుకాయగా, రాజకారులు గ్రామ పొలిమేర నుంచే కాల్పులు ప్రారంభించారు. ఒకటి గ్రామంలోని ఒంటరి రాజయ్య ఇంట్లో, రెండోది ఊరవతల, మూడోది బూరుజుపై పడింది. బురుజుపై తోపు పేలడంతో అక్కడ ఉన్న మందుగుండు సామగ్రి పేలి ఎనిమిది మంది చనిపోయారు. బురుజుపై నుంచి కాల్పుల శబ్దం ఆగిపోవడంతో రజాకారులు గ్రామంలోకి చొరబడి దొరికిన వారిని దొరికినట్లు చంపారు. మొత్తం 96 మందిని చనిపోయారు. వయసులో ఉన్న ఆడవారిని చెరిచారు. శవాల చుట్టూ బతుకమ్మలను ఆడించి కసి తీర్చుకున్నారు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న కూటిగల్‌లో మరో 30 మందిని పొట్టన పెట్టుకున్నారు.



బైరాన్‌పల్లి బురుజు (ఫైల్)


### బైరాన్‌పల్లి చరిత్రను భావితరాలకు అందించాలి



మరో జలియన్‌వాలా భాగ్ ఘటనను తలపించిన బైరాన్‌పల్లి నెత్తుటి గాధ నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఈ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చకుండా ఏడాదికోసారి వచ్చి నివాళులు అర్పిస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆనాటి పోరాట యోధులకు కనీసం పింఛన్ కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటు. సెప్టెంబర్ 17 అధికారికంగా విమోచన దినోత్సవం జరిపి, నాటి పోరాట యోధుల కుటుంబాలను ఆదుకోవాలి. గ్రామంలో స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలి.

- చల్లా చంద్రారెడ్డి, పోరాటయోధుడు, బైరాన్‌పల్లి

## చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17



తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. అంతటి ఘన చరిత్ర కలిగిన ఈ రోజుపై ఇప్పుడు వివాదాలు నడుస్తున్నాయి. ఆ వివాదాల సంగతి పక్కన పెడితే నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారతప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు.

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి)

### ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17. ఈ ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనిక కారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారథి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

### నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నర్సింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

### దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు. అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణనష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎం మున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్... భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.






మహ్మదాపూర్‌లో నిర్మించిన స్మారక చిహ్నం

## రణభేరి.. అనభేరి

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 16: నిజాంకు, అప్పటి జమీందారీ, పెత్తందారి వ్యవస్థలకు వ్యతిరేకంగా అప్పటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు రణభేరి మోగించారు. పోలంపల్లి కేంద్రంగా సింగిరెడ్డి భూపతిరెడ్డితో కలిసి అనభేరి ప్రభాకర్‌రావు ప్రజాసైన్యం ఏర్పాటు చేసి పోరాటం సాగించారు. ఈ దశలో 1948 మార్చి 14న అనభేరి ప్రభాకర్ రావు దళం చేరుకుంది. గ్రామస్థులతో సమావేశమై, గ్రామ శివారు బూసనగట్టు గుట్టల్లో విశ్రాంతి తీసుకుంటుండగా రజాకారులు చుట్టుముట్టారు. గుట్టలపై తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. ప్రభాకర్‌రావు దళానికి.. రజాకార్లకు గంటల తరబడి భీకరపోరు సాగింది. రష్యాకు చెందిన మిషన్‌గన్‌తో ప్రభాకర్‌రావు రజాకారులపైకి ఎదురుదాడికి దిగారు. ఈ పోరాటంలో దళం నేలకొరిగింది. ఇందులో ప్రభాకర్‌రావు, భూపతిరెడ్డిలతో పాటు మరో 10మంది దళ సభ్యులు హతమయ్యారు. సాయుధ పోరాటంలో కరీంనగర్ జిల్లాలో జరిగిన మొట్టమొదటి ఎన్‌కౌంటర్ ఘటన ఇదే. మహ్మదాపూర్ గుట్టల్లో ఎన్‌కౌంటర్‌లో అమరులైన 12 మంది అమరుల పేర స్థూపాలు నిర్మించారు.

## పోరాటానికి ఊపిరిలూదిన చేర్యాల

● రజాకార్లను ఎదిరించిన వీరభూమి
● చరిత్రకెక్కని వీరన్నపేట, నాగపురి పోరాటం



షబాషీగూడెం గ్రామంలో రజాకార్ల క్యాంపు ఏర్పాటు చేసుకున్న గడి

చేర్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని పలు గ్రామాలు ఉద్యమాలకు ఊపిరిగా నిలిచాయి. చేర్యాల మండలంలోని వీరన్నపేట, నాగపురి, ఆకునూరు గ్రామాల వీరోచిత పోరాటం చరిత్రకు ఎక్కలేదు. అమరుల కుటుంబాలను పాలకులు పట్టించుకోకపోవడంతో ఉసూరుమంటున్నారు. నిజాంకు వ్యతిరేకంగా నల్లగొండ జిల్లా భువనగిరి, ఆలేరు కేంద్రాలుగా ఆరుట్ల రాచంద్రారెడ్డి, కుర్రారం రాంరెడ్డిల నేతృత్వంలో జరిగిన పోరాటంలో చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన సుమారు 80 కుటుంబాలకుపైగా పాల్గొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. రక్షక దళంగా ఏర్పడి రజాకార్లను ఎదుర్కొన్నారు. గ్రామశివారులోని కుంటలు, కట్టలు, ఏనెలను ఆసరాగా చేసుకుని ఎనిమిది మంది రజాకార్లను చంపారు. దీంతో రజాకార్లు గ్రామంపై కసితో దాడులు జరిపి ఆరెల్ల అయిలయ్య, ఆరెల్ల బాలయ్య, ఆరెల్ల వీరయ్య, బొడుగం సిద్ధిమల్లయ్య, బొడుగం మీనయ్యతో పాటు మరొకరిని గ్రామశివారులోని బంజెరుబావి వద్ద గడ్డివాములో వేసి సజీవ దహనానికి పాల్పడ్డారు. ఆలేరు- జనగామ- దుద్దెడ మార్గాలలోని కల్వర్టులు, బ్రిడ్జిలు కూల్చడానికి యత్నిస్తున్న క్రమంలో మొగుళ్ల దుర్గయ్య, అరిగె మల్లయ్య, అరిగె లచ్చయ్యను రజాకార్లు తుపాకులతో కాల్చారు. దుర్గయ్య, మల్లయ్య మృతిచెందగా, లచ్చయ్య తప్పించుకుని కొన్నాళ్లక్రితం మృతిచెందాడు. మొగుళ్ల ముత్యంరెడ్డి, మొగుళ్ల ఎల్లారెడ్డి, ఎర్రం భూమయ్యలు నాగపురి క్యాంపులో అరెస్ట్‌చేశారు. అలాగే, మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన జొర్రీగల వీరారెడ్డి నాయకత్వంలో సాయుధపోరాటం సాగేది. నాగపురి, షబాషీగూడెంలో రజాకార్లు క్యాంపు కొనసాగుతుండగా, సమాచారాన్ని చేరవేస్తున్న 38మంది ముస్లింలను కుర్రారం రాంరెడ్డి, నాగపురికి చెందిన గొట్టం వెంకట్‌రెడ్డి, గొట్టం కేశవరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో నాగపురి బురుజు వద్ద హతమార్చి, సమీపంలో బావిలో పూడ్చిపెట్టారు. దీంతో రజాకార్లు గ్రామాలపై దాడులు చేసి, వీరారెడ్డిని పట్టుకుని క్యాంపు జైలులో పెట్టారు. ఆయన దుస్తులను విప్పుకుని బురుజు నుంచి దూకి తప్పించుకుని రహస్యంగా ఉద్యమాన్ని నిర్వహించసాగాడు. కుర్రారం రాంరెడ్డిని పట్టుకున్న రజాకార్లు శబాషీగూడెం క్యాంపు వద్ద హత్యచేశారు. మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన సందిటి వెంకట్‌రెడ్డి, ఏల శంకరయ్య, పున్నెల నర్స య్యలు సాయుధపోరాటంలో పాల్గొన్నారు. రజాకార్లు గ్రామంపై దాడికి పాల్పడి మహిళలను నగ్నంగా బతుకమ్మ ఆటలాడించారు.

## త్వరలోనే ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, పీఆర్సీ



ఉపాధ్యాయుడు గఫార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయులు

గజ్వేల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, పీఆర్సీని ప్రభుత్వం అందజేయనుందని శాసనమండలి సభ్యుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు మహ్మద్ గఫార్ ఉద్యోగ విరమణ అభినందన సభను పీఆర్టీయూ గజ్వేల్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు శ్రీపాల్‌రెడ్డి, డాక్టర్ వంటేరి యాదవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి హెల్త్‌కార్డులను ఆమోదించారని, త్వరలోనే ఉద్యోగులందరికీ షరతులు లేకుండా అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వర్తింపజేసేలా హెల్త్‌కార్డులు వస్తున్నాయని తెలిపారు. రేవంత్‌రెడ్డిని ఒప్పించి గతం కంటే మెరుగైన పీఆర్సీని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇప్పిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులకు శాపంగా మరిన సీపీఎస్ పథకాన్ని రద్దు చేయించి, ఓపీఎస్ అమలుపరిచే ఉద్యమం నిర్మిస్తామని, సెప్టెంబరు 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఇందిరాపార్కు వద్ద 25 వేల మంది ఉపాధ్యాయులతో ధర్నా నిర్వహించామన్నారు. 11, 12 జీవోలు సవరించి బీఈడీ వారికి కూడా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పదోన్నతులు వచ్చేట్లు జీవో ఇప్పిస్తామని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష లేకుండా ప్రభుత్వంతో రివ్యూ పిటిషన్ కోర్టులో వేసేట్లు ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు వంగ మహేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, అదారాసుపల్లి శశిధరశర్మ, ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రావి ఆకుపై మోదీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రాన్ని రావి ఆకుపై చిత్రించారు నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్. తెలంగాణ విమోచన దినాన్ని పురస్కరించుకుని సర్దార్‌పటేల్ ఎదుట నిజాం నవాబు తలవంచిన చిత్రాన్ని కూడా రావి ఆకుపై చిత్రించారు.



రావి ఆకుపై నరేంద్రమోదీ చిత్రం

## చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరు : జాన్‌వెస్లీ

చేర్యాల/మద్దూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించబోరని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సిద్దిపేట జిల్లా చేర్యాలలోని గాంధీ చౌక్ నుంచి ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి బురుజు వరకు సీపీఎం ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ చేపట్టారు. ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమాల్లో మాట్లాడారు. దున్నేవాడికే భూమి కావాలని కమ్యూనిస్టులు చేసిన వీరోచితపోరాటంతో పేదలకు 10 లక్షల ఎకరాల భూములను పంచిందన్నారు. పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ తామే వారసులమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూములున్నాయని, వాటిని పేదలకు పంచే దమ్ము బీజేపీకి ఉందా? అని ప్రశ్నించారు. చారిత్రక వీర బైరాన్‌పల్లిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు, సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు ఉడుత రవీందర్, నక్కల యాదవరెడ్డి, కాముని గోపాలస్వామి, కొంగరి వెంకట్‌మావో, బండకింది అరుణ్‌కుమార్, రాళ్లబండి నాగరాజు, శశిధర్, తాడూరి రవీందర్ శెట్టిపల్లి సత్తిరెడ్డి, భాస్కర్, కొంగరి వెంకట్‌మావో ఆలేటి యాదగిరి పాల్గొన్నారు.





సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లిలో అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

### సురవరం సుధాకర్‌రెడ్డి అజాత శత్రువు : చాడ

హుస్నాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి దివంగత సురవరం సుధాకర్‌రెడ్డి అందరి హృదయాలను చూరగొన్న అజాత శత్రువు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో జరిగిన సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిబద్ధత, సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నుంచి సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఎదిగారన్నారు.

## ముగిసిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

అమీన్‌పూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లా 69వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బీరంగూడలో నిర్వహించిన బ్యాడ్మింటన్ రెండురోజుల సెలక్షన్ పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 170 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-14, 17 బాల బాలికల విభాగంలో జిల్లాస్థాయి క్రీడా జట్టుకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీలకు బీరంగూడ సాయిరాంనగర్ కాలనీ వీరస్వామి బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా నిలిచింది. ముగింపులో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నర్రా భిక్షపతి, కాంగ్రెస్ నాయకుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, రమేష్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ, శ్రీనివాస్‌రావు, వీరస్వామి, సత్యారావు, విజయ్‌కుమార్, కిష్టయ్య, రమేష్, కరుణాకర్‌రెడ్డి, రవి గోపాల్‌గౌడ్, పవన్‌రాజ్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## సింగూరుకు వరద

పుల్‌కల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతున్నది. అధికారులు మూడు క్రస్ట్ గేట్లను ఎత్తగా, మంగళవారం మూడు గేట్లను ఎత్తి వరద ప్రవాహాన్ని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 47,788 క్యూసెక్కులు వస్తుండగా, ఔట్ ఫ్లో 50,751 క్యూసెక్కులుగా నమోదైంది. ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా 48,242 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 1,849 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 390 క్యూసెక్కులు ఆవిరవుతుండగా మొత్తం ఔట్‌ఫ్లో 50,751 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టులో 520.730 మీటర్లకు 17.313 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. సంగారెడ్డి సమీపంలోని మంజీర రిజర్వాయర్ వద్ద 4,5,6,7 నంబర్ క్రస్ట్‌గేట్లను 5 మీటర్లు, స్కవర్ గేట్‌ను మీటరున్నర ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

## రైతులకు తప్పని యూరియా కష్టాలు



చిన్నశంకరంపేట మండలం చందంపేట సహకారం సంఘం వద్ద యూరియా కోసం బారులుతీరిన రైతులు

చిన్నశంకరంపేట/తొగుట/తూప్రాన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇప్పటికీ యూరియా కష్టాలు తప్పడం లేదు. మంగళవారం చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట సహకార సంఘానికి యూరియా లోడ్ రావడంతో రైతులు, మహిళలు అధిక సంఖ్యలో బారులుతీరారు. పోలీసుల పహారా మధ్య యూరియా విక్రయించారు. తొగుట మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు రాత్రి నుంచే పెద్ద సంఖ్యలో తొగుట మార్కెట్‌యార్డుకు చేరుకుని టోకెన్ల కోసం క్యూలైన్ కట్టి గంటల కొద్దీ నిల్చున్నారు. తొగుట ఆగ్రోస్ దుకాణానికి 1,560, కో ఆపరేటివ్ సొసైటీకి 450 యూరియా బస్తాలు రాగా.. అంతకంటే ఎక్కువ సంఖ్యలో రైతులు బారులుతీరారు. దీంతో పోలీసు పహారాలో ఒక్కొకరికి రెండు బస్తాల చొప్పున యూరియాను సాయంత్రం వరకు పంపిణీ చేశారు. మిగతా రైతులకు రెండురోజుల్లో పంపిణీ చేస్తామని, ఆందోళన చెందవద్దని అధికారులు చెప్పడంతో రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తూప్రాన్ పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 500 బస్తాల యూరియా రావడంతో రైతులు భారీగా తరలివచ్చారు. ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో ఒక్కొక్క రైతుకు ఒక యూరియా బస్తాకు టోకెన్లు అందజేశారు.



తూప్రాన్‌లో రాత్రి 8 గంటలకు కొనసాగుతున్న యూరియా పంపిణీ

## న్యూస్ బాక్స్

### పిల్లల ప్రవర్తనను గమనించాలి

హవేళిఘణపూర్, సెప్టెంబరు 16;(ఆంధ్రజ్యోతి); పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను గమనించాలని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని డైట్ కళాశాలలో బాలల రక్షణ- అక్రమ రవాణా అనే అంశంపై జిల్లాలోని పాఠశాల్లోని పాధ్యాయులకు శిక్షణ కార్యక్రమానికి హజరై మాట్లాడారు. పాఠశాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించి పిల్లలను జాగృతం చేయాలని తెలిపారు.

### ఎరువుల స్టాక్ పరిశీలన

హవేళిఘణపూర్, సెప్టెంబరు16;(అంధ్రజ్యోతి); మండలంలోని ఫరీద్‌పూర్ సొసైటీలో రైతులకు అందుబాటులో ఉన్న యూరియా స్టాక్‌ను డీఏవో దేవకుమార్ మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

### ఘనంగా హిందీ దివస్

మునిపల్లి/జిన్నారం, సెప్టెంబర్16 (ఆంధ్రజ్యోతి): పలు పాఠశాలల్లో హిందీ దివస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మునిపల్లి ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో భీంసింగ్ పాల్గొని హిందీ భాష ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదేవిధంగా జిన్నారం మండలంలోని వావిలాల ప్రభుత్వ పాఠశాలలో హిందీ దివస్ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. హిందీపై విద్యార్థులకు అవగాహన కల్పించి పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు.

### సాయుధ పోరాటంపై రాజకీయం

నారాయణఖేడ్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంపై బీజేపీ దుష్ట రాజకీయం చేస్తుందని ఎంసీపీఐ(యూ) రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు తుకారం నాయక్ విమర్శించారు.. మంగళవారం ఖేడ్‌లో తెలంగాణ సాయుధ పోరాటాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు.

● **జహీరాబాద్:** పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో తెలంగాణసాయుధపోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఐ జిల్లాకార్యదర్శి సయ్యద్ జలాలోద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కొనసాగిన వారి విగ్రహాలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో వీరతెలంగాణ సాయుధ పోరాట సభనునిర్వహించారు.

### క్రీడల్లో గిరిజన గురుకుల విద్యార్థులకు ఓవరాల్ చాంపియన్

నర్సాపూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఎస్జీఎఫ్ ఆటల పోటీలలో నర్సాపూర్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు అన్ని పోటీలలో తమ ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరచగా, మంగళవారం ఎంఈవో తారాసింగ్ బహుమతులు అందచేశారు.

### మహిళాభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

జహీరాబాద్, సెప్టెంబరు16ఆంధ్రజ్యోతి): మహిళాభ్యున్నతికి కాంగ్రెస్‌ప్రభుత్వం చేస్తున్నకృషి అమోఘమని నియోజకవర్గ మహిళాకాంగ్రెస్ అధ్యక్షు రాలు అస్మా, తదితరులు పాల్గొన్నారు. మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం హుగ్గెల్లి గ్రామంలో మహిళాదినోత్సవం నిర్వహించి కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు.

### తైబజార్ రద్దు చేయాలి

నర్సాపూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మున్సిపాలిటీలో కూరగాయలు విక్రయించేవారికి ఎలాంటి సదుపాయలు కల్పించకుండానే తైబజార్ పేరిట వసూలు చేయడం తగదని, వెంటనే రద్దు చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట ఉపాధ్యక్షుడు చిన్నరమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ నాయకులు కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

### పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హత్నూర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారులు సంధ్యారాణి ,హేమలత సూచించారు. మంగళవారం మండలంలోని ఎల్లమ్మగూడ గ్రామంలో ఏషియన్ పెయింట్ వారి ఆర్థిక సహకారంతో దన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.



# సంగారెడ్డిలో అధ్వానంగా రోడ్లు

- గుంతలమయం
- ఇళ్ల మధ్యలో మురుగునీరు నిల్వ
- దుర్వాసనతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి
- పట్టించుకోని అధికారులు



సంగారెడ్డిలోని ఓం శాంతి కాలనీ వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని రోడ్లు అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానిక 12వ వార్డు పరిధిలోని ఓం శాంతి కాలనీ నుంచి ప్రగతి నగర్, మల్కాపూర్, గీతానగర్, రాజంపేట వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును బాగు చేయాలని పలుసార్లు మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కాగా సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి శివారులో ఉన్న శిల్పా వెంచర్‌లో మురుగునీటి కాల్వల నిర్వహణ అధ్వానంగా మారిందని ఆ ప్రాంతవాసులు తెలిపారు. అంబేడ్కర్ కాలనీ వద్ద మురుగు కాల్వ లేకపోవడంతో ఇళ్ల మధ్యలో మురుగు నీరు నిలిచి దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది సీజనల్ వ్యాధులకు గురవుతున్నారని, తక్షణమే మురుగుకాల్వలను శుభ్రం చేయాలని కోరారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



టేక్మాల్, కోహీర్ మండలాల్లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

శివ్వంపేట/చిలప్‌చెడ్/నర్సాపూర్/జోగిపేట/కోహీర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఉపాధ్యాయ దినోత్సవంతో పాటు ఇతర సందర్భాలను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. మెదక్ జిల్లాలోని శివ్వంపేట ఉన్నత పాఠశాల పీఎంశ్రీకి ఎంపికైన నేపథ్యంలో కృషి విజ్ఞాన్ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో గురువందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతంరావు పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిలప్‌చెడ్ మండలకేంద్రంలోని రైతువేదికలో ఎంఈవో విఠల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించినట్లు ఎంఈవో తెలిపారు. నర్సాపూర్‌లోని లయన్స్‌భవన్‌లో ఉపాధ్యాయ దినోత్సవంతో పాటు ఇంజనీరింగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్‌ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు ఆధ్వర్యంలో పలువురు ఇంజనీర్లు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. టేక్మాల్ మండలంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఎంపిక చేసిన 19 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు,పూలమాలలతో సన్మానించి, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలకేంద్రంలోని రైతు వేదికలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలకు చెందిన 26 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంఈవో జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో పురస్కారాలను ప్రదానం చేశారు.

## మోదీని యువత ఆదర్శంగా తీసుకోవాలి



నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎంపీ బీబీపాటిల్

గుమ్మడిదల/నారాయణఖేడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధానిగా అత్యధిక కాలం బాధ్యతలు నిర్వర్తించి చరిత్ర సృష్టించిన నరేంద్ర మోదీని యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పిలుపునిచ్చారు. మోదీ జన్మదినం సందర్భంగా గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ చౌక్ ఆవరణలో రాష్ట బీజేపీ పిలుపు మేరకు సేవాపక్షం లో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి ప్రజలు, కార్యకర్తలు, యువత ఉత్సాహంగా హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ప్రీమియం వలంటరీ బ్లడ్ సెంటర్ ఏ యూనిట్ ఆఫ్ తలసాని వెల్ఫేర్ సొసైటీ తరఫున రక్తదానం దాతలకు సర్టిఫికెట్లను జిల్లా అధ్యక్షురాలు స్వయంగా అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపరెడ్డి, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ, మండల అధ్యక్షుడు సిందోల్ దశరత్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో గోదావరి అంజిరెడ్డి, బీబీపాటిల్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట అధికార ప్రతినిధి సంగప్ప, జిల్లా నాయకులు పాల్గొన్నారు. 100 మంది వరకు రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఎద్దుమైలారం స్కూల్‌ను సందర్శించిన జపాన్ బృందం



ఎద్దుమైలారం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో జపాన్ విద్యార్థుల బృందం

కంది, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని ఎద్దుమైలారం గ్రామంలో ఉన్న జడ్పీహెచ్‌ఎస్‌ను ఐఐటీహెచ్ పరిశోధకులతో కలిసి జపాన్‌లోని షిమెన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో కే.జోగప్ప జపాన్ విద్యార్థుల బృందానికి ఘనస్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలో విద్యాబోధన, మనదేశ సంస్కృతీ, సంప్రదాయాల గురించి వారికి వివరించారు. జపాన్-భారతదేశాల మధ్య మానవ సంబంధాలను బలోపేతం చేయడానికి ఐఐటీహెచ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ స్థాపించామని ఐఐటీహెచ్ ప్రొఫెసర్ హేమంత్ నూతలపాటి తెలిపారు. అందుకోసమే ఇక్కడి విద్యాబోధనా పద్ధతులతో పాటు, గ్రామీణ జీవన విధాన స్థితిగతులను తెలుసుకునేందుకు జపాన్ విద్యార్థులను ఎద్దుమైలారానికి తీసుకొచ్చామని పేర్కొన్నారు. అనంతరం జపాన్ విద్యార్థులతో పాఠశాలలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఎంఈవో కే.జోగప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐఐటీహెచ్ ప్రొఫెసర్ హేమంత్, జపాన్ విద్యార్థులు ఇనోయు, వాడా, కడోవాకి, మురోమాచి, దకగావా, ససకి, హయకావా, కజిహర పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన డీసీసీ అధ్యక్షుడు

నర్సాపూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో కాంగ్రెస్ నాయకులంతా కలిసికట్టుగా పని చేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా నాయకులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీసీఅధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కలిశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లాలో రాజకీయాల పరిస్థితులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరుపై చారు. జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్టు డీసీసీ అధ్యక్షుడు పేర్కొన్నారు. అదేవిధంగా అదేవిధంగా మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన మద్దూరి నాగరాజు, నాగులపల్లి వెంకట్‌రెడ్డి, రాజు, తూప్రాన్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సీఎంను కలిశారు.



సీఎంతో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తదితరులు

## పేద విద్యార్థులకు అండగా పరిశ్రమ

గుమ్మడిదల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం పరిశ్రమలు కూడా చేయూత అందించాల్సిన అవసరం ఉందని హానర్ పరిశ్రమ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం హానర్ పరిశ్రమ యాజమాన్యం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న సుమారు 550 మంది విద్యార్థులకు బ్యాగులు, బుక్స్, దుస్తులు, స్టేషనరీ సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హానర్ పరిశ్రమ ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ దశరథ్, మాజీ ఎంపీటీసీ మద్దుల బాల్‌రెడ్డి హానర్ పరిశ్రమ సోషల్ రెస్పాన్సిబుల్ ప్రతినిధులు సుధాకర్, అరుణ్ రెడ్డి, హెచ్ ఆర్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చౌక ధరల దుకాణంలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని 53 నెంబరు చౌక ధరల దుకాణం ను మంగళవారం సబ్ కలెక్టర్ ఉమాహారతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణం వద్ద ఉంచిన స్టాక్ బోర్డుతో పాటు దుకాణంలో బియ్యంను తూకం చేస్తున్న యంత్రంను సరుకుల నిల్వ తదితర వివరాలను పరిశీలించి, లబ్ధిదారుల ద్వారా సరుకుల అందుతున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం డీలర్ సంతోషి రాణితో ప్రజలకు పంపిణీ చేస్తున్న విధానం తెలుసుకొని దుకాణంను పరిశుభ్రంగా ఉంచి, లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట పౌర సరఫరాల డీటీ మహేష్, ఆర్ఐ.మాధవ రెడ్డి, జీపీవో సుధాకర్‌లు ఉన్నారు.

### ఇంటి తాళం పగలగొట్టి రూ.90వేలు చోరీ

జోగిపేట రూరల్, సెప్టెంబర్16 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి నగదు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన అందోల్ మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట గ్రామానికి చెందిన సింగిలక్ష్మి అనే మహిళ అదే గ్రామానికి చెందిన తన కూతురు ఉషమ్మ ఇంటికి ఆదివారం వెళ్లింది. సోమవారం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం ధ్వంసమైనట్టు బాధితురాలు లక్ష్మి గమనించింది. లోనికి వెళ్లి చూడగా ఇనుప పెట్టెలో భద్రపరుచుకున్న రూ.90 వేలు చోరీకి గురైనట్టు గ్రహించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ పాండు తెలిపారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

రేగోడు సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి, చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని గజవాడలో జరిగింది. మంగళవారం ఎస్ఐ పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గజవాడ గ్రామానికి చెందిన సుశీల(58) 6 నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుంది. ఈ నెల 10న కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగింది. కుటుంబీకులు నారాయణఖేడ్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించింది. కుమారుడు సుధాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

### విద్యుత్ సరఫరాలో లోపాలు ఉండొద్దు

● రాష్ట్ర సెక్రటరీ జనరల్ బీసీ రెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపాలు ఉండొద్దని రాష్ట్ర సెక్రటరీ జనరల్ బీసీ రెడ్డి అన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మంగళవారం సంగారెడ్డిలో నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిఒక్కరూ చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. మనోరంజన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, డిస్కమ్ కార్యవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. కాగా తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రకాష్ జాదావత్, కార్యదర్శిగా సిద్దరాజు, కోశాధికారిగా రాజేశ్వర్ స్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మధుసూదన్ రెడ్డి, అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు.

### ఇందిరమ్మ రాజ్యం కాదు.. బకాయిల పాలన

● ఎమ్మెల్సీ అంజిరెడ్డి



రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బకాయిల పాలన నడుస్తోందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం రామచంద్రాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల నిరుపేదలకు అందాల్సిన ఉచిత వైద్యం భారంగా మారుతోందన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లింపులు జరపకుండా నిలిపివేయడం వల్ల ఆరోగ్యశ్రీ సేవలు అందడం లేదని వివరించారు. వైద్యాన్ని ప్రాథమికంగా తీసుకోకుండా రేవంత్‌రెడ్డి చేతులెత్తేయడం దారుణమని వివరించారు. బకాయిలు చెల్లింపులు జరపకపోవడం వల్ల ప్రవేటు ఆసుపత్రులు పూర్తిగా నిరుపేదలకు ఉచితంగా అందుతున్న ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిగా నిలిపివేశారన్నారు. తక్షణం రూ.1200 కోట్లు చెల్లించి ఉచిత వైద్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల పక్షాన పార్టీ తరపున ఆందోళన చేపడతామన్నారు.

### శ్మశాన వాటికల్లో సౌకర్యాలు



ప్రహరీ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ ముస్లిం మైనారిటీలకు చెందిన శ్మశానవాటికలో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమాంతరమైన అభివృద్ధి చేసే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు అబ్దుల్‌గని, అబ్దుల్‌గఫార్, ఖదీర్, హబీబ్‌జాని, పీటర్, నయీమ్, అక్బర్ అలీ తదితరులు ఉన్నారు.

### స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

రేగోడు సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సూచించారు. మంగళవారం రేగోడు మండలంలోని గజవాడ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త శివకుమార్ స్వామి అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలుసుకొని ఆయనను పరామర్శించారు. కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి సుంకే రమేష్, పండరి రెడ్డి, మాజీ సర్పంచ్ అనిత, నర్సింగ్ రావు, నర్సింలు, రాచోటి సుభాష్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు రవీందర్ తదితరులు ఉన్నారు.

### విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య




మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ నూతన బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల పట్లప్రత్యేక శ్రద్ధచూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎలాంటి న్యాయపరమైన సలహాలు, సూచనలు అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### నర్సాపూర్ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నర్సాపూర్ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రోగులను నిరంతరం పర్యవేక్షిస్తూ వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుక పంపిణీ కోసం నర్సాపూర్‌లోని మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక డంప్ చేసిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా శ్మశాన వాటికలో నూతనంగా నిర్మించిన ఆధునిక శ్మశాన వాటికను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. వెంట ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● **కంగ్టి:** మండల కేంద్రమైన కంగ్టిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో సత్తయ్య తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ వార్డుల్లో వసతులు పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు.

### ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ప్రజా పాలన వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారిగా పలు బాధ్యతలను కేటాయించారు. వేదిక ఏర్పాట్లు శుభ్రత, పారిశుధ్యం, తాగునీటి వసతి, నిరంతర విద్యుత్ సరఫరా, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల సమన్వయం తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో పద్మజారాణి, డీఎస్పీ సత్తయ్యగౌడ్, డీఎస్‌వో బాల సరోజ, సివిల్ సప్లయ్ మేనేజర్ అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా హార్టికల్చర్ అధికారి సోమేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

### పక్షం రోజుల్లో 118 హెల్త్ క్యాంపులు: డీఎంహెచ్‌వో

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వాస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 118 హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నట్లు సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల తెలిపారు. జిల్లాలోని 150 సబ్ సెంటర్లతో పాటు జనరల్ ఆస్పత్రి, ఏరియా, స్పెషలిస్ట్ డాక్టర్లున్న పీహెచ్‌సీలలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోషకాహారం, మహిళా సాధికారతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### భెల్ కూడలి జాతీయ రోడ్డుకు సుల్తాన్‌పూర్ అవుటర్ జంక్షన్‌తో అనుసంధానం

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం భెల్ కూడలి జాతీయ రహదారి నుంచి సుల్తాన్‌పూర్ అవుటర్ జంక్షన్‌కు అనుసంధానం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ రఘునందన్‌రావు కోరారు. ఈ మేరకు బుధవారం భెల్ కూడలిలో వరద కాలువల ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి పరిశీలించారు. కాలువల పైభాగంలో జరిగిన అక్రమ కట్టడాలను ప్రత్యక్షంగా చూపించారు. భెల్ కూడలి నుంచి అమీన్‌పూర్ రోడ్డులోని ఆక్రమణలను పరిశీలించారు. భెల్ కూడలి జాతీయ రహదారి నుంచి సుల్తాన్‌పూర్ అవుటర్ జంక్షన్‌కు అనుసంధానం చేయడం వల్ల వేలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ప్రయోజనకరంగా మారుతుందని కమిషనర్‌కు ఎంపీ వివరించారు. వరద కాలువ సజావుగా పారకపోవడం వల్ల కానుకుంట నివాసితుల ఇళ్లల్లోకి నీరు చేరుతున్నాయని కమిషనర్‌కు వివరించారు. కాలువ పైభాగం నుంచి వంతెన నిర్మించి అవుటర్‌కు అనుసంధానం జరిగేటట్టు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఇందుకు రూ.వందకోట్లు కేటాయించాలని ఎంపీ రఘునందన్‌రావు కోరారు. స్పందించిన కమిషనర్ ఇంజనీర్లను పంపి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయిస్తామని చెప్పారు.

### సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం: మెదక్ ఎమ్మెల్యే

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమాలు దేశానికే ఆదర్శమని, ప్రజా ప్రభుత్వంలో ప్రజా పాలన సాగుతుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కామారం, కామారం తండాను సందర్శించి కామారం గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీలో రూ. 15 లక్షలతో నిధులు మంజూరైన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. అనంతరం కామారం తండాలో ప్రజా వేదికను ఏర్పాటు చేసి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ,మాజీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గడీల సుధాకర్, రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మంగ్యా నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సేవాపక్షం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి

● బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్

మెదక్, అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా అక్టోబరు 2 వరకు సేవా పక్షం కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్, చిత్రలేఖనం, నమో మారథన్, మహనీయులు జయంతి వేడుకలు, కిసాన్, ఎస్సీ, ఎస్టీ మోర్చా ప్రత్యేక కార్యక్రమాలు, ఆసుపత్రులు, పాఠశాలల్లో పండ్ల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, జిల్లా కార్యదర్శులు నాగరాజు, బాలరాజు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.